క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలపల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. గత రాత్రి వివాహం చేసుకున్న నూతన దంపతులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కొల్లాటి రామారావు, ఈఓ డి.రామకృష్ణంరాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోదండ రామాలయం ప్రారంభం



రామాయలంలో ప్రత్యేక పూజలు చేసిన దృశ్యం

యలమంచిలి: స్థానిక చిలుకూరి వారి వీధిలో డీసీసీబీ బ్యాంకు వద్ద పున ర్నిమించిన కోటి లింగాల కోదండ రామాలయంలో శ్రీసీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి దేవేరులను దర్శించుకున్నారు. భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్రీస్తు మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ఇలపకుర్రులో పోస్టర్ విడుదల చేస్తున్న ఇండిపెండెంట్ గాస్పల్ చర్చి సభ్యులు

యలమంచిలి: మండలంలోని ఇలపకుర్రు గ్రామంలో ఉన్న ఇండిపెండెంట్ గాస్పల్ చర్చిలో ఈ నెల 23, 24, 25 తేదీలలో మూడు రోజులపాటు క్రీస్తు శాంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు సభల కన్వీనర్ నామవరపు కృపాదానం తెలిపారు. సంఘ సభ్యులంతా ఆదివారం చర్చిలో సభల నిర్వహణ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కృపాదానం మాట్లాడుతూ ప్రపంచశాంతి, సకల ప్రాణుల శ్రేయస్సు దృష్ట్యా ఈ సభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలంతా వచ్చి ఈ సభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాస్టర్ తానేటి సైమన్ సభ్యులు సప్తాల శ్రీనివాస్, ముప్పిడి అబ్రహం, ఈతకోట మోషేను, ఉల్లంపర్తి ప్రసాద్, చెవ్వేటి కిషోర్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి నూతన భవనానికి శంకుస్థాపన



గొల్లవానిచెరువులో రోటరీక్లబ్ ఆఫ్ గోదావరి నూతన భవనానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని వడ్లవాని పాలెం పంచాయతీ పరిధిలోని గొల్లవానిచెరువులో రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి నూతన భవన నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చేగొండి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రోటరీ గవర్నర్ వి.భాస్కర రామ్, సోమంచి శ్రీనివాస శాస్త్రి దంపతులు శాస్త్రోక్తంగా భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి క్లబ్ నూతన భవనం దోహదం చేస్తుందని గవర్నర్ భాస్కరరామ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, మేడికొండ రామదాసు, యాతం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కళకళలాడిన బీచ్



బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

మొగల్తూరు: మండలంలోని కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలి వచ్చారు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటంతో సముద్ర స్నానం చేస్తూ సేదతీరారు. అనంతరం తీరంలోని ఆలయాలను దర్శించుకున్నారు.

రైతులకు ప్రభుత్వం అండ

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: అకాల వర్షాలతో తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసి, రైతులకు అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం నరసాపురం మండలం చిట్టవరం గ్రామంలో ఇటీవల నూతనంగా రూ.21.90 లక్షలతో నిర్మించిన రైతుబరోసా కేంద్రం, రూ.15 లక్షలు గడపగడపకూ కార్యక్రమ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనం, గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో రెండు సీసీ రహదారులను ఆయన ప్రారంభించారు. అలాగే మండల పరిషత్ నిధులు రూ.3 లక్షల వ్యయంతో గ్రామంలోని అంబేడ్కర్ కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న వంటషెడ్ పనులకు ప్రసాదరాజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చిట్టవరం గ్రామ సచివాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రసాదరాజు మాట్లాడుతూ కొన్ని ప్రతిపక్ష పార్టీలు, దళారులు రైతులను రెచ్చగొట్టేందుకు చూస్తున్నాయన్నారు. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే రైతు పండించిన ప్రతీ గింజనూ కొనుగోలు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. చిన్న చిన్న లోపాలను పెద్దవిగా చేసి చూపేందుకు ఈ ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. ఈ పరిస్థితులను ముందుగానే గుర్తించిన సీఎం జగన్ ప్రతీ గ్రామాలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. రైతులు మోసాలకు గురికాకుండా ఉండేందుకు ఈ కేంద్రాలు దోహదపడుతున్నాయన్నారు. ఆర్బీకేల ఏర్పాటుతో రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు, పురుగు మందులు సకాలంతో అందడంతోపాటు వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారన్నారు. దాన్యం మద్దతు ధరకే కొనులోలు చేస్తామని, గోనె సంచులు, లేబర్, రవాణా చార్జీలను రైతు ఖాతాకు జమ చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో రైతులు ఎవరూ తమ ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోలేదన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో దళారుల ప్రమేయం లేకుండా రైతుల నుంచి నేరుగా ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా రైతులు పంట సాగు చేసుకోవాలన్నారు. ధాన్యం సేకరణ విషయంలో దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, రైతులకు ప్రభుత్వ పరంగా అందిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గొంది, చిట్టవరం గ్రామాల్లో ఇంతవరకూ క్రాప్ ఇన్సూరెన్స్ రూ.78.41లక్షలు, ఇన్‌పుట్ సబ్సిడీ రూ.44.55లక్షలు, రైతు భరోసా పథకం కింద రూ2.26 కోట్లు, పంట రుణాల సున్నా వడ్డీ కింద రూ.4.97లక్షలు మొత్తంగా రూ.3.53 కోట్ల రూపాయలు ఈ గ్రామ పరిధిలోని రైతులకు లబ్ధి చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో ఆప్‌కాబ్ మాజీ చైర్మన్ అంగ్రాజు చల్లారావు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, ఎంపీటీసీ నక్కా లక్ష్మీనారాయణ, మండలపార్టీ అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ, వైసీపీ నాయకులు కాకిలేటి మధు, అంతర్వేది నాగేశ్వరరావు, రావి పండు, ఈదా విక్రం, బుంగా కృపావరం, మాజీ సర్పంచ్ చల్లా సత్యనారాయణ, గొంది గ్రామ సర్పంచ్ మద్దాల అంజిబాబు, ఏడీఏ ఈదా అనిల్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై శ్రీమన్నారాయణుడు



శేషవాహనంపై స్వామివారి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి శేషవాహనంపై తిరువీధి ఉత్సవం చేశారు. ఉదయం అలంకార తిరుమంజనం, దివ్యప్రబంధ సేవాకాలం, సుందరకాండ పారాయణం, పూర్ణాహుతి, మంగళాశాసనము, సాయంత్రం దివ్యప్రబంధ సేవాకాలం, ఊంజల్‌సేవ చేశారు. స్వామివారి అలంకరణకు రేపాక ప్రవీణ్‌భాను కైంకర్యం చేశారు.

సచివాలయ సందర్శన



మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు సత్కరిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: మత్స్యశాఖ రాష్ట్ర కమిషనర్, జిల్లా ప్రత్యేక అధికారి కె.కన్నబాబు ఆదివారం సాయంత్రం నరసాపురం మండలం చిట్టవరం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ నెల 19 నుంచి ప్రారంభంకానున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ పర్యటనకు వచ్చారు. స్పందన అర్జీల పనితీరు, పరిష్కారం, సచివాలయల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, లోటుపాట్లు కంప్యూటర్‌లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. తొలుత కన్నబాబు, చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు శాఖా పరంగా పలు విషయాలు చర్చించుకున్నారు. నరసాపురం మండలం లిఖితపూడిలో నిర్మాణంలో ఉన్న ఆక్వా యూనివర్సిటీ పనులను పరిశీలించేందుకు రావాలని కన్నబాబును ప్రసాదరాజు కోరారు. త్వరలోనే వస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆప్‌కాబ్ మాజీ చైర్మన్ అంగ్రాజు చల్లారావు కమిషనర్ కన్నబాబును శాలువకప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫాజిల్, ఎంపీడీఓ శివప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మొగల్తూరు: నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం, మొగల్తూరులోను సోమవారం చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు చీఫ్ విప్ కార్యాలయం సిబ్బంది తెలిపారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలో రూ.2.70 కోట్లతో నిర్మించనున్న రహదారి పనులకు శంకుస్థాపన, మొగల్తూరు సత్రవుపాలెంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం , అబ్రహంపేటలో రూ.15 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనానికి ప్రారంబోత్సవాలు చేయనున్నట్లు వారు తెలిపారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి



రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీఐ రాంబాబు

పాలకొల్లు సెంట్రల్: రవీంద్రనాథ్ ఠాకూర్ కేవలం కవి మాత్రమే కాదని అధ్యాత్మికవేత్త, చిత్రకారుడు, మానవతావాదని పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.రాంబాబు అన్నారు. ఆదివారం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐ రాంబాబు మాట్లాడుతూ కవితలకు పత్రికలు రాస్తూ అనతికాలంలోనే పెద్ద చదువులు కోసం ఇంగ్లాడ్ వెళ్లారన్నారు. తిరిగి వచ్చిన తరువాత శాంతినికేతన్ పాఠశాలను స్థాపించారని నేడు ఆ పాఠశాలే విశ్వభారతి యూనివర్శిటీగా అభివృద్ధి చెందిందన్నారు. అతని అద్భుత కావ్యాల్లో గీతాంజలికి 1913లో నోబెల్ సాహిత్య పురస్కారం లభించిందన్నారు. ఆసియా ఖండంలోనే తొలి పురస్కారం అందుకుని భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎస్.ముత్యాలరావు, పీఎంసీ చైర్మన్ కొత్తల వెంకట కుమారి, డాక్టర్ ఎస్వీ రంగారావు, హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, కెల్ల పెద్దిరాజు, చల్ల ముత్యం తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్



దగ్గులూరులో ధాన్యం రాశి వద్ద రైతులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ హామీ ఇచ్చారు. పాలకొల్లు మండలం దగ్గులూరు, శివదేవునిచిక్కాల, తిల్లపూడి, లంకలకోడేరు, బల్లిపాడు గ్రామాల్లో ఆదివారం శ్రీనివాస్ పర్యటించి పలువురు రైతులతో మాట్లాడారు. పంట నష్ట పరిహారం చెల్లించడానికి ఇప్పటికే అధికారులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలిచ్చారన్నారు. నష్టం వివరాలను నమోదు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని శ్రీనివాస్ వివరించారు. పంట నష్టపోయిన ప్రతీ రైతుకి పారదర్శకంగా నష్టం వివరాలను నమోదు చేసి న్యాయం చేస్తారన్నారు. రైతులు ఆందోళన చెందకుంగా ధైర్యంగా ఉండాలని శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

ధాన్యం విక్రయించేందుకు ఆఫ్‌లైన్ విధానం

వాతావరణం అనుకూలంగా లేనందున ప్రభుత్వం ఆఫ్‌లైన్ విధానంలో ధాన్యం కొనుగోళ్లకు రైస్‌మిల్లర్లకు అనుమతులిచ్చారన్నారు. ధాన్యం రాశిని సంచుల కొరత లేకుండా టిప్పర్ ద్వారా రైస్‌మిల్లులకు తరలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని శ్రీనివాస్ వివరించారు. అనంతరం ఆయన లంకలకోడేరులోని జడ్డు గాంధీబాబు రైస్‌మిల్లును సందర్శించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలను పరిశీలించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, దగ్గులూరు సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం, మాజీ సర్పంచ్ సప్పరపు కోటేశ్వరరావు, విశ్వనాథం పేరయ్య, శివదేవునిచిక్కాల ఉపసర్పంచ్ ఆకుల నాగ మురళి, జేసీఎస్ మండల కన్వీనర్ పార్శి వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

నైతిక విలువలతో జీవించాలి



యాళ్లవానిగరువు లేమెన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న చిన్నారులు

పాలకొల్లు అర్బన్: చిన్నారులు నైతిక విలువలు కలిగి సేవా భావంతో జీవనం సాగించాలని పాస్టర్ జాన్ శామ్యూల్ అన్నారు. పాలకొల్లు మండలం యాళ్లవాని గరువులో గల లేమెన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విరామ బైబిల్ శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ శిబిరంలో 750 మంది చిన్నారులు పాల్గొన బైబిల్‌లో ఆధ్యాత్మిక విషయాలను పాటలు, చిన్నచిన్న కథలు, పప్పెట్ షో, ఆటల ద్వారా శిక్షణ పొందారు. శిక్షణా తరగతులు ముగింపు సందర్భంగా యాళ్లవానిగరువు నుంచి యడ్లబజారు వరకు బైబిల్ శిక్షణ పొందిన చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. పాలకొల్లు పరిసర ప్రాంతాలతో పాటు కొమ్ముచిక్కాల, మలికిపురం గ్రామాల నుంచి చిన్నారులు పాల్గొని బైబిల్ శిక్షణ పొందారు. బైబిల్‌లోని పలు అంశాల్లో పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సిస్టర్ మేరీ పెర్సిస్, జాన్సన్, వలంటీర్లు పాల్గొని సేవలందించారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావంతో ఉండాలి

నరసాపురం రూరల్: భక్తిభావం, సేవాభావంతో ఉంటే ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం తూర్పుతాళ్లు గ్రామపరిధిలోని కరింశెట్టిపాలెంలోని శ్రీశ్రీశ్రీ భక్తాంజనేయస్వామివారి నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. పెద్దింటి అనిల్ కుమారాచార్యులు సిద్ధాంతితో అడ్డాల నాగేశ్వరరావు, నాగరత్నకుమారి, కరింశెట్టి కృష్ణ, లక్ష్మి దంపతులు ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

13న హనుమాన్ చాలీసా పారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న జిన్నూరు సొసైటీ చైర్మన్ డీటీడీసీ బాబు

పోడూరు: మండలంలోని జిన్నూరు గ్రామంలో ఈ నెల 13, 14 తేదీల్లో ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగే హనుమాన్ ఛాలీసా పారాయణ, రథయాత్ర కార్యక్రమంలో భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని జిన్నూరు సొసైటీ చైర్మన్ డీటీడీసీ బాబు పిలుపునిచ్చారు. జిన్నూరు గ్రామంలో 22 దేవాలయాల కమిటీలు, సొసైటీ చైర్మన్ డీటీడీసీ బాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్న హనుమాన్ ఛాలీసా, రథయాత్ర కార్యక్రమాలపై శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయ ప్రాంగణంలో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన డీటీడీసీ బాబు మాట్లాడుతూ ఈ నెల 13న ఉదయం హనుమాన్ ఛాలీసా పోటీలు, సాయంత్రం పాలకొల్లు-జిన్నూరు గ్రామాల మధ్య రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న ఉదయం 9గంటలకు భద్రాచలంలోని స్వామివారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం, 108 జంటలతో కల్యాణం జరిపించనున్నట్లు చెప్పారు. కల్యాణం అనంతరం అన్నసమారాధన, సాయంత్రం 108 సార్లు హనుమాన్ ఛాలీసా పారాయణ, అనంతరం పోటీల్లోని విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరుపనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని డీటీడీసీ బాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ పెన్మెత్స రాము, భూపతిరాజు సూర్యరాజు, ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షులు గాదె వెంకన్న, సభ్యులు తోట రాంబాబు, ఆచంట వెంకట సుబ్బారావు, కేవీ కృష్ణ వర్మ, జక్కంపూడి కుమార్, గొట్టుముక్కల సూర్య నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

మేడపాడు వెంకమ్మ జాతర ప్రారంభం

యలమంచిలి: మేడపాడు గ్రామ దేవతలు వెంకమ్మ, కనకదుర్గమ్మ, జువ్వాలమ్మ అమ్మవార్ల జాతర ఆదివారం రాత్రి ప్రారంభమైంది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల ఆధ్వర్యంలో జాతర నిర్వహణ కమిటీ పర్యవేక్షణలో అమ్మవార్ల ఘటాలకు ఆదివారం రాత్రి గ్రామానికి దక్షిణం వైపున జాతర నిర్వహించారు. ఉత్తరం వైపున సోమవారం జాతర నిర్వహిస్తారు. 9వ తేదీ రాత్రి బలిహరణ, ఊయల ఉత్సవం నిర్వహించి అమ్మవార్లను ఆలయ ప్రవేశం చేస్తారు. అప్పటి నుంచి ఐదు రోజులపాటు తీర్థ ఉత్సవాలు నిర్వహించడంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయాన్ని హైటెక్ విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

లారీ ఢీకొని మోటర్ సైక్లిస్ట్‌కు తీవ్రగాయాలు



పూలపల్లి బైపాస్‌లో ప్రమాదం జరిగిన ప్రదేశం

పాలకొల్లు సెంట్రల్: మోటర్ సైకిల్‌పై వెళుతున్న తండ్రి కొడుకులను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ముగ్గురికీ గాయాలయ్యాయి. పట్టణంలోని లజపతి రాయ్‌పేటకు చెందిన శంకరాపు దుర్గాప్రసాద్‌కు ఇద్దరు అబ్బాయిలు. దుర్గాప్రసాద్ తల్లి టిడ్కో గృహాల్లో నివాసం ఉంటుంది. దుర్గాప్రసాద్ తల్లి ఇటీవల కువైట్ నుండి వచ్చిందని తెలిసి ఆదివారం తన ఇద్దరు పిల్లలను నానమ్మ ఇంటికి తీసుకెళ్తున్నాడు. ఇంతలో పూలపల్లి బైపాస్ రోడ్డులో మసాలా రెస్టారెంట్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలవ్వగా తన ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ముగ్గురిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దుర్గాప్రసాద్ మామ ఎస్.శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ డి.రాంబాబు తెలిపారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపాయి. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని సబ్‌కలెక్టర్ చెప్పారు. ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని సూచించారు.

అధికారులు సమన్వయంతో రైతులకు అండగా ఉండాలి



మార్టేరులో రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రైతులను వివరాలు అడుగుతున్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

పెనుమంట్ర: స్థానిక అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ఆదివారం పెనుమంట్ర మండలంలోని మార్టేరు రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆమె రిజిష్టర్లను, తేమశాతం చూసే యంత్రాన్ని , స్టాకును కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. మార్టేరు ఆర్‌బీకెలో ఇంతవరకూ ఎంతమంది రైతులు వచ్చారని ఎంత ధాన్యం కొనుగోలు చేశారని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ మార్టేరు రైతు భరోసా కేంద్రంలో 150 మంది రైతులు వచ్చారని ఇప్పటి వరకూ 1032 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించి రైస్ మిల్లులకు రవాణా చేసామని తమ బరోసా కేంద్రం పరిధిలో 130 మంది రైతులు సుమారు 260 ఎకరాల్లో వరికోతలు కోయాల్సి ఉందని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని రైతులు ఎలాంటి ఆందోళన గురికావద్దని భరోసా కల్పించారు. రైతులు రైస్ మిల్లుల వద్దకు వెళ్లాల్సినన, సంప్రదించాల్సిన అవసరం లేదని ప్రతీ రైతు భరోసా కేంద్రం వద్ద వీఆర్వో, వ్యవసాయ అధికారి, సహకార సిబ్బందిని కూడా నియమించామన్నారు. రైతులకు అవసరమైన గోనె సంచులు, హామాలీలు, వాహనాలను రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేశామని రైతులు ధాన్యం సొమ్ము నేరుగా వారి ఖాతలో జమ చేస్తామన్నారు. ఒకసారి ట్రక్ షీట్ జనరేట్ చేసిన తరువాత రైతులు ఎవరూ రైస్ మిల్లుకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు ఎలాంటి అవసరం వచ్చినా కంట్రోల్ రూమ్ నెంబర్ 81216 76653 నెంబరుకు ఫోన్ చేస్తే తక్షణం సమస్యను పరిష్కరిస్తామన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని సాయంత్రాని కల్లా ఆన్‌లైన్ చేయాలన్నారు. రోడ్ల పక్క ధాన్యం ఉండకుండా అధికారులు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలుచేసి మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు ఇబ్బందిపెట్టే రైస్‌మిల్లర్లను ఉపేక్షించేది లేదని అటువంటి రైస్‌మిల్లులను గుర్తించి సీజ్ చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ప్రత్యేక అధికారి రామస్వామి, తహసీల్దార్ డి.అశోక్‌వర్మ, ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జీ, వ్యవసాయ అధికారిణి ఎ.జోషుల తదతరులు పాల్గొన్నారు.